# ఆదర్శాలు అనుభవాలు

సాగర్ ఎమ్మే చదువుతున్న విద్యార్థి.

ఆదర్శాలకోసం ప్రాణాల నర్పించటానికైనా సిద్ధపడే వయస్సు, మనస్సు గల వ్యక్తి.

మంచి సాహిత్యం చదివి, మంచి స్నేహితులతో కలసి తిరిగి, జీవితాన్నిగురించి, మనుష్యులనుగురించి కొన్ని నిశ్చితమైన న్యాయబద్ధమైన నమ్మకాల నేర్పరచుకోవటానికి ప్రయత్నిస్తున్న యువకుడు సాగర్.

ఆర్థికంగా సాంఘికంగా మనుషులలో స్థూలంగా రెండు వర్ణాలున్నాయనీ, అందులో ఒక బలమైన వర్గం, మరొకటి బలహీనమైనవర్గం అనీ. బలమైనవర్గం ఎప్పుడూ బలహీనవర్గాలను దోచుకుంటూ వాళ్ళని అణగద్రొక్కటానికి ప్రయత్నిస్తుందనీ, అందువల్ల మానవతా దృక్పథం

గల ఏ వ్యక్తి అయినా అవసరం వచ్చినప్పుడల్లా బలహీన వర్గాలను సమర్థించాలనీ, వారికి న్యాయం చేకూర్చటానికి ప్రయత్నించాలనీ అతని ఉద్దేశ్యం.

అందుకే ఆర్థికంగా దోచుకోబడుతున్న పేదవాళ్ళకు, ఆర్థికంగాను, సాంఘికంగానుకూడా వెనుకబడిఉన్న బలహీన వర్గాలకు, సాంఘికంగా వెనకబడివున్న స్త్రీలకు అతని హృదయంలో మృదువైన స్థానం వుంది. అవకాశం వచ్చినప్పుడల్లా వారికి జరుగుతున్న అన్యాయాలను తీవ్రంగా విమర్శించటం, వారిని సమర్థిస్తూ మాట్లాడటం చేసేవాడు.

కాని కాలం గడుస్తున్నకొలదీ తాను ఏ వ్యక్తులనైతే సమర్థిస్తూ వాళ్ళకి న్యాయం చేకూరాలని తపించిపోతున్నాడో అ వ్యక్తులలోనే ఎన్నో దుర్మార్గపు లక్షణాలు. క్షమార్హంకాని గుణాలు కనిపించేసరికి తల్లడిలిపోయేడు సాగర్. ఎవరిని ప్రేమించటం తన కర్తవ్యం, జీవితలక్ష్యం, మానవత్వం – అన్నీ – అని భావించేడో వాళ్ళే ఎంతో క్రూరంగా అసహ్యంగా ప్రవర్తించట చూసి ఏం చెయ్యాలో తోచలేదు సాగర్ కి.

ఉదాహరణకి వెనుకబడిన జాతులవారికి ప్రభుత్వం విద్యాసంస్థలలో రిజర్వేషన్లు యివ్వటం, వారికి స్కాలర్ షిప్పు లచ్చి ఆర్థికంగా కూడా సహాయం చెయ్యటం ఎంతో సమంజసంగా కనిపించింది సాగర్ కి.

కాని కొందరు వ్యక్తులు ఆ అవకాశాలను ఎలా దుర్వి

నియోగపరస్తున్నారో అనుభవపూర్వకంగా తెలుసుకున్నాక అసలు వారికి అవకాశాలివ్వటమే తప్పేమోనని ఆలోచించే పరిస్థితికి వచ్చేడు.

సాగర్ క్లాస్‌మేట్ సుదర్శన్. అతనప్పటికే ఐదు ఎమ్మేలు చేసేడు! ఆరవ ఎమ్మే సాగర్‌తో కలసి పనిచేస్తున్నాడు. కారణం యేమిటో అని ఆరా తీస్తే తెలిసిందేమంటే-స్కాలరుషిప్పుకోసం అతను ఇలా వీలున్నన్ని ఎమ్మేలు చేస్తున్నాడట. ప్రభుత్వం యిచ్చే స్కాలరుషిప్పు డబ్బుతో ఖరీదైన బట్టలు కుట్టించుకుని, సిగరెట్లు తాగుతూ జల్సాగా కాలక్షేపం చేస్తూండటంవల్ల ఎమ్మేలోనూ అతను ఫస్టుక్లాసులోనే ప్యాసయ్యేడు. అదే సబ్జెక్టు మరల చదివితే స్కాలరుషిప్పు దొరకదు గనుక సబ్జెక్టును మార్చి మరల విద్యార్థిగా యూనివర్శిటీలో ప్రవేశించటం ప్రారంభించేడు.

తమకి ప్రొఫెసరుగా ఉండవలసిన వయస్సులోని వ్యక్తి తన క్లాస్‌మేటు కావటం ... అందునా దానికి కారణం స్కాలరుషిప్పు కావటం - సాగరుకి ఆశ్చర్యంతోపాటు, అసహ్యాన్ని, కోపాన్నికూడా కలిగించింది.

స్కాలరుషిప్పు యిచ్చే వ్యవధినిగురించి, విద్యార్థి వయోపరిమితినిగురించి సరియైన రూల్సు లేకపోవటంవల్ల సదుద్దేశ్యంతో ప్రభుత్వ మిస్తున్న ఆర్థికసహాయాన్ని సుదర్శన్ వంటి స్వార్థపరుల దుర్వినియోగపరస్తుంటే యువకుడిగా తన కర్తవ్యం యేమిటి? వెనుకబడిన జాతులకు విద్యా ఉద్యోగ

విషయాల్లో ప్రభుత్వం ఉదారంగా ఉండాలన్న ఆదర్శాన్ని బలపర్చటమా? లేక సుదర్శన్‌వంటి వేలాది విద్యార్థులవల్ల ఎంతోమందికి లభించవలసిన అవకాశాలు వృథా అయిపోతున్నాయని ఆ ఆదర్శాన్ని నిరసించటమా? ఎటూ తేల్చుకోలేకపోయేడు సాగరు.

అలాగే రిక్షావాళ్ళనుగురించి, ముష్టివాళ్ళనుగురించి ఎంతో సానుభూతిగా ఆలోచించే సాగర్‌కి తరచు వాళ్ళ ప్రవర్తన కొరడాదెబ్బలా ఛెళ్ళున తగిలి అతని నాలోచింప జేసేది.

ఒసారి ఆరేళ్ళ పిల్లవాడు బస్టాపులో నిల్చునుండగా అతని దగ్గరకువచ్చి "బాబూ! నీ కాల్మొక్కుతా. ధర్మం చెయ్యి బాబూ!" అంటూ కాళ్ళమీద పడ్డాడు.

అమాయకంగా ఉన్న ఆ పిల్లాడికళ్ళూ, పాలుగారుతున్న బుగ్గలుచూసి అంత పసివయసులోనే అడుక్కుతినే గతి పట్టిన అతని దుస్థితికి విచారిస్తూ జేబులో చెయ్యిపెట్టేడు సాగరు.

ఒక రూపాయి నోటుతప్ప మరేం తగల్లేదు. "చిల్లర లేదురా అబ్బీ" అన్నాడు.

"నేను తెస్తాను సార్. ఆ పాన్ దుకాణందగ్గర" అంటూ వందగజాలదూరంలో వున్న పాన్‌షాపువైపు చూపించేడు చేతిని ఆ కుర్రవాడు.

సరే తెమ్మని ఆ కుర్రాడిచేతిలో రూపాయ నోటు పెట్టేడు సాగర్.

నోటందుకుని మెరుపులా దూసుకుపోయ్యేడుకుర్రవాడు. కాని చిత్రం! పాన్ దుకాణం దగ్గర ఆ కుర్రాడు అగలేదు. వేగంగా వెనక్కి తిరిగి చూడకుండా అదేపరుగు.

సాగర్ పరిస్థితిని అర్థంచేసుకునేలోగానే కుర్రాడు కనుమరుగైపోయేడు.

ముక్కుపచ్చలారని ఆ పసివాడిలో అంతటి మోస బుద్ధి వుంటుందని ఊహించను కూడా ఊహించలేని సాగరు అ సంఘటనతో నిరుత్తరుడైనాడు.

కాసేపయినాక తను ఒక కుర్రవాడిచేతిలో 'ఫూల్' అయినందుకు నవ్వొచ్చింది.

కాని ఎంతోసేపు తననిచూసి నవ్వుకోలేకపోయేడు సాగర్! ఎందుకంటే యిప్పుడతని జేబులో బస్సు ఛార్జీలకు కూడా డబ్బులేదు. రిక్షాలో వెళ్ళగలిగే దూరంకాదు తమ ఇల్లు. ఆటోలో వెళ్ళి డబ్బు ఖర్చుపెట్టగల స్తోమతకూడా లేదు తనకి. పైగా ఆటోలు అంత త్వరగా దొరకవుకూడా ఆ ప్రాంతంలో.

ఇక చేసేదేంలేక నడవగలిగినంత దూరం నడిచి ఇల్లు మరో మైలుదూరం వుందనగా రిక్షా చేసుకుని యింటికి చేరు కున్నాడు. ఆ అనుభవాన్ని జన్మలో మర్చిపోలేదు సాగర్.

అలాగే ఒకే కుటుంబానికి చెందిన ముష్టివాళ్ళు వేర్వేరుగా అతనిదగ్గర చేరి డబ్బును తీసుకుని (తమ కే సంబంధం లేదని చెప్తూ) తరువాత కొద్దిదూరంపోయి కలసి పంచుకోవటం, వయసులోని ఆడవాళ్ళు కొందరు కావాలని పైటలు జార్చి మనిషిని తాకుతున్నంత దగ్గరగా నిలబడి కవ్విస్తూ పైసలడుక్కోవటం, కాళ్ళూ కళ్ళూ వున్నవాళ్లుకూడా అవి లేనట్లు నటిస్తూ జాలిని, డబ్బును సంపాదించటం అన్నీ చూసేక ముష్టివాళ్ళంటే జాలికి బదులు అసహ్యం, చిరాకు ఏర్పడినయ్ సాగరులో.

రిక్షావాళ్ళతో కూడా చాలా చేదు అనుభవాలే కలిగినయ్ సాగరుకి.

సాధారణంగా సమంజసమైన రేటుకన్న పదో ఇరవయ్యో పైసలు ఎక్కువగా ఇవ్వటం సాగరుకి అలవాటు. ముఖ్యంగా రిక్షావాళ్ళు ముసలివాళ్ళయినట్లయితే రిక్షాదిగి తరువాత మాట్లాడిన రేటుకన్న ఎక్కువ ఇచ్చేవాడు.

ఒక్కొక్కప్పుడు మరీ చిరిగిన బట్టలు కట్టుకున్న రిక్షావాళ్ళకు తన పాత చొక్కాలు, పాంటునుకూడా ఇచ్చేవాడు. అలాంటి సాగర్ నికూడ ఎంతోమంది రిక్షావాలాలు మోసం చేయాలని చూడటం అతనికి ఆశ్చర్యంతోపాటు బాధను కలిగించేది.

ఒకసారి జ్వరంవచ్చి రెండుఫర్లాంగులదూరంలో నున్న హాస్పిటలుకి వెళ్ళవలసివచ్చింది. ఎంత తీసుకున్నా పాతిక,

ముప్పైపైసలన్న ఎక్కువ తీసుకోడుగదా అన్న నమ్మ కంతో కిరాయి మాట్లాడకుండానే రిక్షా ఎక్కి కూర్చుకుని హాస్పిటలుకి పోనీయమన్నాడు.

హాస్పిటలుదగ్గర దిగగానే పావలా బిళ్ళ చేతిలో పెట్టేడు సాగర్. ఆ నాణెంవంక ఓసారి, సాగరు ముఖంవంక ఓసారి పురుగుల్ని చూసినట్లు చూసి "ఏందయ్యా యిది? ముష్టిస్తున్నట్లు పావలా ఇస్తావా? బలేవోడివిలే" అన్నాడు వెటకారంగా.

సాగరుకి చిన్నతనం వేసింది. మరో పదిపైసల బిళ్ళ యిచ్చేడు.

"ఏందయ్యోయ్, ఏం నాటకాలాడుతున్నావ్? బారనా ఇయ్యి" అన్నాడు గర్జిస్తూ.

"ఏమిటీ? బారనానా? ఇంత దగ్గర దూరానికి బార నానా" నోరు తడారిపోతుండగా అడిగేడు సాగర్.

"బారనా ఇయ్యలేనోడివి చారనాకి వచ్చోరిచ్చేవోడిని ముందుగనే బేరం కుదుర్చుకుని ఎక్కాలి. అంత ఇయ్యలేనోడివి నా రిచ్చా ఎందుకెక్కావ్" అనడిగేడు. అక్కడికేదో తనది మహారాజా రిక్షా అయినట్లు సాగరువంటి సామాన్య మానవుడు అలాంటి రిక్షా ఎక్కటానికి అర్హులు కానట్లు మొహంపెట్టి.

చేసేదేంలేక బేరంచేయకుండా ఎక్కటం తనదే బుద్ధి

తక్కువ అని లెంపలేసుకుని బారనాయిచ్చి వదిలించుకున్నాడా రిక్షావాడిని.

మరోప్పుడైతే అంత ఎక్కువ డబ్బు అడిగినందుకు పట్టికోపమే వచ్చేదేమో కాని తాను జ్వర తీవ్రతలో ఉన్నట్లు తన ముఖం స్పష్టంగానే తెలుపుతోంది. తను మాట్లాడింది కూడా హాస్పిటలుకే. అది తెలిసికూడా కనీసపు దయాదాక్షిణ్యాలు లేకుండా ఆ రిక్షావాలా తనలోని మెతకతనాన్ని ఆధారంగా తీసుకుని తనదగ్గర పక్షిలా గుంజుకున్నాడా అని ఒకటే మథనపడ్డాడు చాలా రోజులవరకు.

కథలలో రిక్షావాళ్ళు చాలా అమాయకులైనట్లు. రిక్షాలో ప్రయాణంచేసే సేఠ్‌లు ఎంతో బరువును రిక్షాలో పెట్టి చాలా దూరం యీడ్పించి యివ్వవలసిన దాంట్లో సగం డబ్బులిచ్చి మహాక్రూరంగా ప్రవర్తించినట్లు చదివేడు సాగర్.

కాని కథల్లో చదివినంత అమాయకులు రిక్షావాళ్ళల్లో ఎన్నడూ కనపడలేదు సాగరుకి. పైగా వాళ్ళెంతో 'కన్నింగ్'గా, ఎలా నాలుగు డబ్బులు మోసంచేసి గుంజుకుందామా అన్న ధోరణిలోనే కనపడ్డారు.

కాస్తంత దూరానికికూడా రూపాయ యివ్వందే రాననటం, ఒక్కోసారి ఒక ధరకి వప్పుకున్నట్లు కనపడి తీరా గమ్యం చేరనాక "నేను అంతకన్న ఎక్కువ మాట్లాడేను" అని డబాయించి డబ్బులు గుంజుకోవడం ఒక్కోసారి వెళ్ళవలసిన స్థలాన్ని ఖచ్చితంగా చెప్పినా, ఆ స్థలం యింకా

అరమైలు ఉందన్న దగ్గరనుండి "ఇంకా ఎంతదూరం పోవాలయ్యా? దిగు దిగు" అంటూ సతాయించటం, ఒక్కొక్కప్పుడు జబర్దస్తీగా దించెయ్యటం, ఇంకొకప్పుడు చేరవలసినచోటు చేరుకున్నాక "ఇంతదూరం రావాలని ముందు నువ్వు నాకెందుకు చెప్పలేదు? అరణా ఎక్కువనివ్వందే కదల్టానికి వీల్లేదు" అని ఖచ్చితంగా చొక్కా కాలరు పట్టుకున్నంత పనిచేసి డబ్బులు వసూలు చేసుకోవటం అన్నీ చూస్తుంటే మతిపోయినంత పనయింది సాగరుకి.

అలాగే పనిపాటలు చేసుకుని బ్రతికే క్రింది తరగతి స్త్రీలనుగురించి ఎన్నో దయనీయమైన కథలు చదివేడు సాగరు. పాచిపనిచేసే ఆడదిగాని, కూలిపనిచేసే ఆడదిగాని యజమానిచేత బలాత్కరింపబడని కథను యింతవరకు చదవలేదు సాగరు.

వాళ్ళనుగురించి వ్రాసే ప్రతికథలోనూ పనిమనుషులు చాలా అందంగా ఉంటారు. బిగువైన శరీరంగల వాళ్ళు. ఒక మగవాడు చెయ్యిపట్టుకుంటే చిగురుటాకులా గజగజ వణికిపోయే వాళ్ళు.

కాని అతనికి నిత్యజీవితంలో తారసపడే పనివాళ్ళు అందుకు విరుద్ధంగా వున్నారు, ఎక్కడో నూటికికోటికి ఒకరు తప్ప అందమైన ఆడవాళ్ళు పనివాళ్ళలో ఎన్నడూ కనపడరు. కాస్త అందంగా వున్నాకా వాళ్ళని మగవాడు చెయ్యిపట్టుకోనక్కర్లేదు. వాళ్ళే మగవాళ్ళను చెయ్యిపట్టుకుని సరసాలాడేంత చలాకీగా వుంటారు. ఇష్టంలేని మొగాణ్ణి యీడ్చి

తన్నగల గుండెధైర్యం, జబ్బబలం మధ్యతరగతి పైతరగతి స్త్రీలలోకంటె క్రింది తరగతి స్త్రీలలోనే ఎక్కువగా కనపడ తయ్. ఐనా రచయితలెప్పుడూ వాళ్ళని అబలలుగా, పేల లుగా ఎందుకు చిత్రిస్తారో అర్థమయ్యేదికాదు సాగరుకి.

ఓసారి వాళ్ళింట్లో ఓ పనిమనిషి చేరింది. వయసులో వున్న పిల్ల, అప్పుడే ఆమెకు పెళ్ళవటమూ, మొగుడు విడిచి పెట్టటమూకూడా జరిగిపోయినయ్‌ట.

ఆమె కథ విని యింట్లో వాళ్ళందరితోపాటు సాగరు కూడా ఎంతో సానుభూతి చూపి, మామూలుగా పనిమనుషు లందరికీ యిచ్చే డబ్బుకన్న ఓ అయిదురూపాయ లెక్కువ యిచ్చి చేర్చుకున్నారు.

ఇంట్లో ఎదిగిన కుర్రవాళ్లు సాగరు, సాగరు అన్న కూడా వున్నారు. అలాటి ఇంట్లో చేరిన పనిమనిషి కథల్లో అయితే మూడోరోజురాత్రికల్లా బలాత్కరింపబడేదే. పైగా ఆమె అందంగా కూడా వుంది. "ఇలాటి వాళ్ళనుగురించే కాబోలు అలాటి కథలు వ్రాస్తారు" అనుకున్నాడు సాగరు.

వారంరోజులు గడిచేక ఆమె ప్రవర్తన విపరీతంగా తోచింది సాగరుకి. ఇల్లూడ్చేటప్పుడు పమిట జార్చటం. సాగరుగాని, అన్నయ్యగాని వున్నప్పుడు వాళ్ళకళ్ళల్లోకి కవ్వింపుగా చూస్తూ నవ్వటం, యింటికి వాళ్ళకోసం వచ్చే కుర్రకారు స్నేహితులను చూస్తూ వయ్యారాలొలకబొయ్య టం యివన్నీ చూసి యింట్లోవాళ్ళంతా కలవరపడిపోయేరు.

ఓరోజు సాగరు ఒంటరిగా గదిలో కూర్చుని చదువుకుంటుంటే మీదపడి కావలించుకున్నంత పనిచేసింది. దాంతో హడలెత్తిపోయాడే ఆ పనిమనిషిని తీసేయించేడు సాగర్.

ఆమె వెళ్ళిన తరువాత రెండురోజులకు ఒక చిన్నస్టీలు గిన్నె మాయమవటం కూడా గమనించేరు.

ఆ తరువాత కొన్నాళ్ళకు వాళ్ళద్వారా వీళ్ళద్వారా ఆ పనిమనిషినిగురించి చాలా విషయాలు తెలిసినయ్. ఆమె ఏ యింట్లో పనిచేసినా నెలరోజులుకన్న ఎక్కువ పనిచెయ్యదు. ఆ నెలరోజులలో వీలైతే యింట్లో వున్న మగవాళ్ళ కోరికలు తీర్చుకోవటం, అది సాధ్యం కాకపోతే గిన్నో చెంబో ఎత్తుకుపోవటం. ఆమెకు అలవాటేట!

ఇంతవరకూ సాగర్ ఆదర్శాలకు, అనుభవాలకు పొంతనలేకుండా కనపడిన వ్యక్తులందరూ ఆర్థికంగా వెనకబడిన వ్యక్తులే! అందువల్ల పొట్టకూటికోసం వాళ్ళు అమానుషంగా ప్రవర్తించటం జరిగివుండవచ్చునని సరిపెట్టుకోవటానికి ప్రయత్నించేడు సాగర్.

మరో విషయంలోకూడా సాగరు ఆలోచనలు తల్లక్రిందులవటం జరిగింది.

స్త్రీజాతిమీద సాగరుకి ఎంతో గౌరవభావం ఉంది. సృష్ట్యాదినుండి ఏ కొద్దిసందర్భాలలోనో తప్ప స్త్రీలకు సంఘంవల్ల పురుషుడివల్ల ఉపకారంకన్న అపకారం ఎక్కువ జరిగిం

దని. ఎంతో అభివృద్ధిచెందిన దేశాలలో బాగా చదువుకుని వున్నతోద్యోగాలలో వున్న స్త్రీలకు కూడా లభించవలసినంత గౌరవం, ఆదరణ లభించటం లేదని నమ్మేవాళ్ళల్లో సాగరు కూడా ఒకడు.

కాని అన్నయ్య పెళ్ళయినాక అతనికి స్త్రీలమీదగల అభిప్రాయాలలో మార్పు రాసాగింది. సాగర్ వదిన శాంత పెద్దగా చదువుకోలేదు అందంకూడా అంతంత మాత్రమే. అహంకారానికి తక్కువేం లేదు.

కాపురానికి వచ్చిన దగ్గరనుండీ తన మాటే నెగ్గాలనీ యింట్లో అందరూ తన అడుగులకు మడుగులొత్తాలనీ అన్నట్లు మాట్లాడేది. అన్నయ్య జీతంలో ఒక్కపైసాకూడా ఇంట్లో యివ్వనిచ్చేదికాదు. ఆమె ఎందుకలా ప్రవర్తిస్తుందో అర్థమయ్యేది కాదు.

అలాగే పక్కింటి మీనాక్షి మొగుడు ఎంతో సౌమ్యుడు మీనాక్షి చాలా అందంగా వుండేది. భర్త ఆమెనెంతో అపురూపంగా చూసుకునేవాడు. చేస్తున్నది గుమాస్తా ఉద్యోగమే అయినా వున్నంతలో ఏ లోటు లేకుండా చూసుకునేవాడు. పైగా పేదింటి కాపరం కూడాను, ఐనా ఆమెకు భర్తలోపం లోటు కనిపించిందో యేమో ఓనాడు ఎదురింట్లో అద్దెకుంటున్న కాలేజీ కుర్రాడితో లేచిపోయింది.

ఆలాటి కేసులన్నీ చూసేక స్త్రీజాతిమీదే అసహ్యం వేయసాగింది సాగరుకి. రచయితలు, ముఖ్యంగా రచయి

త్రులు వర్ణించేటట్లు మగవాళ్ళంతా దుర్మార్గులు కారు సరికదా ఆడవాళ్ళందరూ బేలలుకూడా కారు. వాళ్ళలోను ఈర్ష్య, క్రౌర్యం, వంచన మొదలైన దుష్టలక్షణాలన్నీ ఉన్నాయని అనుభవపూర్వకంగా తెలిసింది సాగరుకి.

ఐనా స్త్రీలనుగురించి, వాళ్ళ సమస్యలనుగురించి కథ లెందుకు వ్రాస్తున్నారు? ఎందుకు వ్రాయాలి? అలా ఆలో చించటం ప్రారంభించేడు సాగరు.

తన ఆదర్శాలకూ, అనుభవంతో గ్రహించిన సత్యా లకూ ఎంతో వ్యత్యాసం వున్నమాట నిజమే! అంతమాత్రాన వెనకబడిన జాతులను, పేదవాళ్ళనీ, స్త్రీలనీ, బలహీనవర్గా లను అసహ్యించుకోవటం తగునా?

దోపిడీవర్గాలలో వున్నన్ని కుతంత్రాలు, మోసాలు ద్వేషాలు దోపిడీ చేయబడుతున్న వర్గాలలో కూడా వున్న మాట నిజమే! అలాటప్పుడు రచయితగాని, కళాకారుడు గాని, మానవతా దృక్పథంగల ఏ వ్యక్తయినాగాని ఎవరిని సమర్థించాలి?

"మనుషులందరూ చెడ్డవాళ్లే"నని మానవజాతి మొత్తాన్ని ద్వేషించాలా?

"అందరూ మంచివారే! పరిస్థితులే మనుషులను చెడ్డ

(17)

వాళ్ళని చేస్తాయి" అని పరిస్థితులను నిందిస్తూ అందరితోనూ సరిపెట్టుకోవాలా?

అసలలా తటస్థంగా ఒక మనిషి వుండటం సాధ్యమేనా ? అవసరం వచ్చినప్పుడు ఎవరిని సమర్థించాలి?

ఈ ప్రశ్నలు చాలారోజులు సాగరుని వెంటాడినయ్. కొంతకాలం గడిచేక అతనో విషయాన్ని గ్రహించేడు. మంచివాళ్ళు అన్నివర్గాలలో ఎప్పుడు వుంటారు. మంచిగాని చెడుగాని పరిస్థితులనుబట్టి స్వభావసిద్ధంగానే మనిషిలో వుంటుంది. అవి మానవ సహజమైన గుణాలే!

కాని ఏదో ఒకవర్గాన్ని, మనిషిని సమర్థింపవలసి వచ్చినప్పుడు బలవంతునికన్న బలహీనమైన వానిని, దోపిడీ చేసేవాడికన్న చేయబడేవాడిని సమర్థించటమే మానవత్వం.

భారతయుద్ధంలో తప్పొప్పులు యిరుపక్షాలలోను సరిసమానంగా జరిగినయ్. ఐనా పాండవ పక్షపాత అవటానికి కారణం పాండవులు సర్వస్వాన్నీ కోల్పోయి అడవులపాలై నానాబాధలుపడటం, కౌరవులు అధికారంలో ఉండటమూను, అలాగే రావణుడు ఎంత నిష్ఠాపరుడైనా, ఎంత బలవంతుడు, సద్గుణ సంపన్నుడూ అయినా పరపురుషుని భార్యనెత్తుకు వచ్చినవాడు. గౌరవాన్ని, భార్యనీ పోగొట్టుకున్నవాడు

రాముడు. అందుకే సీతను నిండుచూలాలుగా అడవులకు పంపినా, వాలిని చంపటంలో యుద్ధ ధర్మాన్నతిక్రమించినా రావణుడిమీదకన్న రాముడిమీదనే ప్రజలకు సానుభూతి, ప్రేమ వుంటాయి.

కాబట్టి దారిద్ర్యంవల్లగాని, చిత్తచాంచల్యంవల్లగాని ఎన్ని తప్పులు చేసినా ఆ తప్పులు చేయని బలవంతులకన్న, బలహీనులను సమర్థించటమే ఆదర్శప్రాయమని నిర్ధారణకు వచ్చేడు సాగర్.